నియోజకవర్గ అభివృద్ధికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సుభాష్ చంద్రబోస్‌నగర్-ఏలో సీసీ రోడ్డు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సమస్యను త్వరగా పరిష్కరించినందుకు స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బలరాం, జహంగీర్ భాయ్, పద్మ, గుమస్తా మధు, అబేద్, గట్టయ్య, డేవిడ్ రాజు, నాగరాజు, జర్జ్, రఘువీర్ రెడ్డి, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన ప్లేట్లు అందజేత



విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న క్రాంతి కిరణ్

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల గ్రామానికి చెందిన యువకుడు ఎర్రోళ్ల క్రాంతి కిరణ్ జీడిమెట్ల గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత, అంగన్‌వాడీ కేంద్రం, వెన్నెలగడ్డ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో సుమారు 900 మంది విద్యార్థులకు భోజన ప్లేట్లు, అల్పాహారాన్ని గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు యూ.కల్యాణి ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకుడు సిద్ధి రాములు, బీజేపీ నాయకులు బర్మా నరేశ్, గ్రామ యువకులు సందీప్, జయప్రకాశ్, అక్షయ్, సతీశ్ విజయ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. దీంతో సంబంధిత చెక్కులను బాచుపల్లి కార్యాలయంలో కొలన్ హన్మంత్‌రెడ్డి లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్, మాజీ కార్పొరేటర్ పల కృష్ణ, సిద్దనోళ్ల సంజీవరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బేకు శ్రీనివాస్, పండరి రావు, సంతోష్ ముదిరాజ్, ఎండీ లాయక్, ఎండీ.అజాద్, సయ్యద్ షఫీ, సురేందర్‌రెడ్డి, ఎండీ గఫ్ఫార్, అజయ్, తులసీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



చెక్కులు తీసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాలక్ష్మి చెక్కుల పంపిణీని ప్రారంభించారు. ఇటీవల 680 మందికి చెక్కులు వచ్చాయని మరో 150 చెక్కులు రావాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. వీటిని రోజువారీగా 100 మందికి సమాచారం అందించి అందిస్తున్నట్లు తెలిపారు. చెక్కుల తీసుకునేందుకు లబ్ధిదారులు కుటుంబ సమేతంగా రావడంతో కార్యాలయం సందడిగా మారింది.

వారాహి నవరాత్రులు ప్రారంభం



హోమంలో కొలన్ తేజ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం వారాహి నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త కొలన్ తేజ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ క్షేమంగా ఉండాలని లోక కల్యాణం కోసం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించినట్లు తెలిపారు.

20 రోజుల్లోనే.. | 10 షెటర్లు..!

ప్రభుత్వ అనుమతుల్లేకుండా నిర్మించిన వైనం

ఓ అక్రమ నిర్మాణదారుడి బరితెగింపు

- ప్రభుత్వ నిధులతో వేసిన ఫుట్‌పాత్, గ్రీనరీ సైతం ధ్వంసం
- మున్సిపల్ అధికారులకు ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు
- తూతూమంత్రంగా చర్యలు తీసుకున్న అధికారులు



నెల రోజుల కిత్రం ఉన్న ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్, గ్రీనరీ

కుత్బుల్లాపూర్: అది ప్రధాన రహదారి..నిత్యం ఎంతోమంది అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ రోడ్డుపక్కనే ఓ అక్రమ నిర్మాణదారుడు బరితెగించాడు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ సుభాష్‌నగర్ పైపు లైన్ రోడ్డులో ఓ ప్రైవేట్ స్కూలు ఎదుట ఎలాంటి అనుమతుల్లేకుండా ఏకంగా 20 రోజుల్లోనే 10 షెటర్లు నిర్మించాడు. దీనిపై అనేక ఫిర్యాదులు వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోవడంతో ఇప్పుడు అవి వ్యాపార కేంద్రాలుగా మారాయి. అంతేగాకుండా షెటర్లకు అడ్డుగా ఉన్న ప్రభుత్వ నిధులతో నిర్మించిన గ్రీనరీ, ఫుట్‌పాత్‌లను తొలగించి పార్కింగ్ కోసం వినియోగించుకోవడం గమనార్హం. అయితే అక్రమ నిర్మాణాలను కూల్చివేయాల్సిన అధికారులు పార్కింగ్ కోసం వేసిన రోడ్డును మాత్రమే తొలగించి జరిమానా విధించి వెళ్లడం పలు అనుమానాలకు తావిస్తోంది.



ఫుట్‌పాత్ తొలగించి పార్కింగ్ కోసం వేసిన సిమెంట్ రోడ్డును తొలగిస్తున్న జేసీబీ

ట్రాఫిక్ సీఐ ఫిర్యాదు..

ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఫుట్‌పాత్‌తో పాటు గ్రీనరీని సైతం ధ్వంసం చేసి షెటర్ల పార్కింగ్‌కు వినియోగించారు. అయినా కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు మాత్రం చోద్యం చూడడంతో అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు ఫిర్యాదుతో మేల్కొన్నారు. దీంతో అధికారులు హడావిడి చేసి పార్కింగ్ కోసం వేసిన సిమెంట్ రోడ్డును తొలగించి వెళ్లిపోయారు. ప్రభుత్వ ఆస్తులను నష్టం కలిగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసేందుకు వెళ్లి..

అక్రమంగా 10 షెటర్ల నిర్మాణంపై కుత్బుల్లాపూర్ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తీరా చూస్తే అన్ని దుకాణాలు ప్రారంభమై వ్యాపారాలు కొనసాగించడం జరిగిపోయింది. ఇదంతా టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే జరిగిందని పుకార్లు..షికార్లు చేస్తున్నాయి. అల్వాల్ ట్రాఫిక్ సీఐ ఫిర్యాదుతో ఇంజినీరింగ్ అధికారులు జేసీబీతో అక్కడికి వెళ్లి నిర్మాణాన్ని కూల్చివేయాల్సి ఉండగా టౌన్ ప్లానింగ్ అధికారుల డైవర్షన్‌తో కేవలం ఆక్రమణకు గురైన రోడ్డును మాత్రమే తవ్వి వెళ్లారు.

రూ.3 లక్షల ఫైన్ వేసి చేతులు దులుపుకుని..

ఉప కమిషనర్ నరసింహ ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాల వద్దకు వెళ్లి హడావిడి చేసి రోడ్డును తవ్వి రూ.3 లక్షల ఫైన్ వేసి సదరు కాపీని అక్రమ నిర్మాణంలో ఉంటున్న వ్యక్తికి అందజేసి వెళ్లిపోయారు. ఇప్పటికీ 10 రోజులు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకున్నా దాఖలాలు లేవు. అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసిన వెంటనే తొలగించాలని ఓ వైపు గ్రేటర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ ఇక్కడ కిందిస్థాయి సిబ్బంది మాత్రం అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తాం



అనుమతుల్లేకుండా నిర్మించిన 10 షెటర్ల నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. ఇదే విషయాన్ని టౌన్ ప్లానింగ్ అధికారి సురేందర్ రెడ్డికి చెప్పి అక్రమ నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కూల్చివేయిస్తాం.

– నరసింహ, కుత్బుల్లాపూర్ మున్సిపల్ కమిషనర్

తహసీల్ కార్యాలయాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాశ్‌తో కలిసి గురువారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. పై చదువులు, ఉద్యోగం నిమిత్తం వేల సంఖ్యలో కుల, ఆదాయ, స్థానిక ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు రాగా, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను ఇన్‌చార్జి తహసీల్దార్ స్వామిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గాజులరామారం లోని సర్వేనంబర్ 307, 342 ప్రభుత్వ స్థలంలో ఇటీవల కూల్చివేసిన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. గత 6 నెలలగా స్థానికంగా తహసీల్దార్ లేనప్పటికీ ఇన్‌చార్జి తహసీల్దార్‌తో ఎప్పటికప్పుడు దరఖాస్తులు పరిష్కరిస్తున్నామని తెలిపారు. త్వరలోనే తహసీల్దార్‌ను నియమిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం, సర్వేయర్ జ్యోతి తదితరులు ఉన్నారు.

బైక్ చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

దుండిగల్: బైక్ చోరీలకు పాల్పడుతున్న ముఠాను దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ సిహెచ్ శంకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. గాజులరామారం దేవేందర్‌నగర్‌కు చెందిన షేక్ ఫైసల్ అలియాస్ సోనూ(20), షేక్ అబ్దుల్లా అలియాస్ అబ్బు (22), సతీశ్ (32)తో పాటు మరో బాలుడు జులాయిగా తిరుగుతుంటారు. కాగా జల్సాలకు అలవాటు పడ్డ వీరు సులువుగా డబ్బు సంపాదించేందుకు చోరీల బాట పట్టారు. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగలించి వాటిని విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో తమ అవసరాలను తీర్చుకుంటారు. విశ్వసనీయ సమాచారం మేరకు దుండిగల్ పోలీసులు గురువారం బహదూర్‌పల్లి చౌరస్తాలో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించిగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. దుండిగల్, సూరారం, బాలానగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీకి పాల్పడ్డ రూ.10 లక్షల విలువైన 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. ఈ సందర్భంగా దుండిగల్, సూరారం సీఐలు పి. సతీష్, భరత్‌కుమార్, డిఐ బి.సతీష్, సిబ్బందిని ఏసిపి శంకర్‌రెడ్డి అభినందించారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



కమిషనర్ సబేర్ అలీకి వినతిపత్రం ఇస్తున్న వామపక్ష కార్మిక సంఘాలు

నిజాంపేట్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఏఐటీయూసీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పాలబిందెల శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎండీ సబేర్ అలీని గురువారం కలిసి సమ్మె నోటీసుతో కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్మిక చట్టాలకు బదులుగా 4 లేబర్ కోడ్స్‌గా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. వీటికి నిరసనగా సమ్మెకు పిలుపునిచ్చామని తెలిపారు. కార్యక్రమంలో వామపక్ష కార్మిక నాయకులు రవి, పెంటయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని కష్టంగా కాకుండా ఇష్టంతో చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని, జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని తూంకుంట, దేవరయాంజల్‌లోని మండల పరిషత్ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. తరగతి గదులు సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, విద్యార్థులకు పంపిణీ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పాఠాలు బోధించేటప్పుడు విద్యార్థులు శ్రద్ధతో విని వాటిని గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు, వసతులు కల్పిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుల బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మరమ్మతులను చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపించాలని, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, డీఈఓ విజయకుమారి, మున్సిపల్ డీఈ సునీత, మేడ్చల్ సీడీపీఓ శారద, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం



సుభాష్‌నగర్: మహీంద్రా విశ్వవిద్యాలయానికి చెందిన స్కూల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, ఇటలీలోని ప్రముఖ ఇటాలియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కలినరీ ఆర్ట్స్ అండ్ హాస్పిటాలిటీకి చెందిన సీఏఎస్టీ అలిమెంటితో గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు మహీంద్రా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ యాజులు మేదూరి, సీఏఎస్టీ అలిమెంటి సీఈఓ క్రిస్టియన్ కాంటలుప్పి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా యాజులు మెదూరి మాట్లాడుతూ.. స్కూల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, సీఏఎస్టీ సంయుక్తంగా ఇటాలియన్ గాస్ట్రోనమీ, ఇటాలియన్ పేస్ట్రీ ఆర్ట్స్‌పై ప్రత్యేక 3 నెలల షార్ట్ టర్మ్ కోర్సును అందించనున్నాయి. పాకశాస్త్రంపై ఆసక్తి, ప్రొఫెషనల్‌గా ఎదగాలనుకునే వారికి ఈ కోర్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇటలీకి చెందిన ప్రముఖ చెఫ్‌లు, పాకశాస్త్ర నిపుణులు స్వయంగా హైదరాబాద్‌లోని మహీంద్రా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో తరగతులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో మహీంద్రా విశ్వవిద్యాలయానికి చెందిన స్కూల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ డీన్ తిరుజ్ఞాన, సీఏఎస్టీ అలిమెంటి సీఈఓ క్రిస్టియన్ కాంటలుప్పి సీఏఎస్టీ అలిమెంటి అకడమిక్ మేనేజర్ అన్నా మారియా స్కాటినా, అకడమిక్ బిజినెస్ గ్రోత్ కన్సల్టెంట్ సన్నీ మెనన్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



మృతుంజయ

కుత్బుల్లాపూర్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మేడ్చల్ జిల్లా కన్వీనర్‌గా మృతుంజయ నియమితులయ్యారు. ఆర్మూర్‌లోని క్షేత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ఈమేరకు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తామని, తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన ఏబీవీపీ రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

3న వేలం

పోచారం: యంనంపేట్‌లోని రంగనాథస్వామి దేవస్థానంలో జూలై 3న ఉదయం 11 గంటలకు కొబ్బరికాయలు, పూజా సామగ్రి వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.భాగ్యలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు షరతులకు లోబడి వేలంలో పాల్గొనాలని కోరారు. సామాగ్రి కాలపరిమితి 2025 ఆగస్టు 1 నుంచి 2026 జూలై 31 వరకు ఉంటుందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



స్థానికులతో కలిసి పర్యటిస్తున్న బీజేపీ నేత భరత్‌సింహారెడ్డి

కుత్బుల్లాపూర్: సమస్యల పరిష్కారానికి అధికారులకు పాటుపడాలని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి కోరారు. జీడిమెట్ల డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ ఫేస్-3లో తాగునీరు, డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన కాలనీవాసులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రవి, శ్రవణ్ బోస్, అలివేలు, సంపత్, సురేందర్, సుధాకర్, నారాయణ, శ్రీనివాస్, జగన్, రామకృష్ణ, అప్పారావు, అనురాధా, పద్మావతి, నారాయణ, సోను, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



నిజాంపేట్: వికాస్ సబ్‌స్టేషన్ 11 కేవీరెడ్డి కాలనీ ఫీడర్‌లో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాయికాలనీ, సాయి జ్యోతినగర్, రెడ్డికాలనీ, బికె ఎన్‌క్లేవ్, శాంటియా స్కూల్. అలాగే 11కేవీ కేంద్రియ విహార్ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేంద్రియ విహార్ అపార్ట్‌మెంట్స్, క్రికెట్ గ్రౌండ్ రోడ్, కొలంబస్ స్కూల్ రోడ్, రత్నదీప్ వెనుక వైపు, ఏఎస్ రాజు నగర్, మిత్రాహిల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజాంపేట్: విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ గేమ్ ఛేంజర్ అవార్డ్స్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఫౌండర్ సీఈఓ సత్యవోలు రాంబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ అండ్ కల్చర్, కవులు, గాయకులు, కళాకారులు, జ్యోతిష్యం బిజినెస్, వైద్యులు, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, సామాజిక సేవ, ఎంటర్‌టైన్‌మెంట్, డిఫరెంట్ ప్రొఫెషనల్స్, మీడియా, హెల్త్, సైన్స్ అండ్ టెక్నాలజీ, డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ, జస్టిస్, లా అండ్ ఆర్డర్, ఫైనాన్స్ అండ్ బ్యాంకింగ్, అచ్చివర్స్, స్పిరిచువల్, హాస్పిటాల్టి లాంటి తదితర విభాగాల్లో జూలై 5లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్ కోసం 9959971679, 8121208279 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

శామీర్‌పేట : మూడుచింతలపల్లి మున్సిపాలిటి కేశవరంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం జరిగింది. ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా మర్యాల రమేష్, ధర్మకర్తలుగా ముద్రగణం రాజుకుమార్, కొంపల్లి ప్రవీణ్‌కుమార్, కాసుల వెంకటేష్, దీరావత్ శంకర్‌లను దేవాదాయ, ధర్మాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ ప్రణీత్, ఈవో శ్రీనివాసులు నూతన కమిటీని ప్రమాణ స్వీకారం చేయించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలుయాదవ్, రాష్ట్ర హజ్‌యాత్ర కమిటీ సభ్యుడు ముజీబ్‌హుద్దీన్, ఏ- బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు విశ్వేశ్వరగుప్తా, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మేడ్చల్, బాలానగర్ జోన్ల పరిధిలో డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, తమ సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు.

– కుత్బుల్లాపూర్



బాచుపల్లి బీవీఆర్ఐటీ కళాశాలలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పోలీసులు, విద్యార్థులు



ఐడీపీఎల్ చౌరస్తాలో ర్యాలీ ప్రారంభిస్తున్న బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్



ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, పోలీసులు



అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు



ర్యాలీలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ బాలగంగిరెడ్డి, సీఐ విజయవర్ధన్